కథానిక:

# థర్మామీటరు

శ్రీ కొవ్విడి లక్ష్మన్న

ఇప్పుడే హుషారుగా వచ్చేడు గోపాలం. బంగళా కాంపౌండులో కారు హారన్ విని ముందు పోర్టికోలోకి పరుగెత్తుకువచ్చేరు యిద్దరు పిల్లలూనూ. అమాయక ఆనందంతో తనని ఆహ్వానిస్తూన్న పెద్దపిల్ల బుగ్గలు నిమిరి, చంటివాడిని యెత్తుకుని ముద్దులాడి, వాళ్ళకి నాలుగు గజాలవెనకనే వున్న యిల్లాల్ని ప్రసన్నదృక్కులతో పలకరిస్తూనే, అలా పడమటి గదిలోకి వెళ్ళేడు. కిటికీకి చేరువగా వేసిన పెద్దమంచం మీద మెత్తని బాలీసు నానుకుని తండ్రి పడుకు న్నాడు. నిశ్శబ్దంగా నిలుచుని నిఘాగా రెండునిమి షాలు చూసేడు గోపాలం, ఖాయిలాతో పడుకున్న తండ్రివైపు. దీర్ఘంగా ఊపిరితీస్తున్న గాలి సవ్వడి తప్ప అంతా ప్రశాంతంగా ఉంది గది. ఇప్పుడే పట్టినటులుంది మాగన్ను; ఎందుకూ లేపడం అను కుంటూ తలవైపు గోడకి తగిల్చివున్న టెంపరేచరు ఛార్టు చూచాడు. ప్రక్కనే మేజామీద ఓ మందు సీసా, అవున్నగ్లాహ అదీయిదీ 'మేం వున్నాం; మరేం ఫరవాలే'దన్నట్టు కంటికి కనిపించేయి. తల పంకించి మేడమీదికి పోయేడతను. అంతలో టెలి ఫోను మోగింది. డాక్టరు పిలిచేడు. ఉదయం తను వొచ్చి చూసిన సంగతీ, తండ్రి జబ్బు వివరాలూ ఏవో మాట్లాడేడు. ఓ గంటలో మళ్లీవచ్చి చూస్తా నన్నాడు.

"ఇంజక్షనుకి మందు కొన్నారు గదూ?" అన్నాడు డాక్టరు.

"ఓ యెస్....థేంక్యూ" అంటూ ఫోనుదించేడు గోపాలం.

బట్టలు మార్చుకుని భోజనానికి లేద్దాం అను కుంటూ, పోనీ ఓసారి జ్వరం చూద్దాం అను కున్నాడు; కాని, దాని దుంప తెగా! ఎంత వెతి కినా థర్మామీటరు ఎక్కడ ఉందో కనిపించలేదు. గూళ్లూ, అలమార్లూ అన్నీ వెతకడం అయింది. ఇల్లంతా గాలించి యిల్లాలు ఇందిరా అలిసిపోయింది. దీక్షమాత్రం మానలేదు, ఉభయులూ.

"ఇప్పుడు మెట్లు దిగుతూ చేత్తో పట్టుకున్నాను సుమండీ! అంతలో యెక్కడ పెట్టేసేనో యెడమ చేత్తోను" అంది ఇందిర జరిగినదంతా ఒక్కొక్క విషయమే నెమరుకి తెచ్చుకుంటూను.

"అవసరానికి అవుపించే ఆనవాయితు యింకో నాడు ఉండి యేడిశింది గనకనా? కాస్సేపుపోయిన తరవాత యే దొడ్డి చెంబుకోసమో వెళుతూఉంటే ఎదరగా ప్రత్యక్షం అవుతుంది అదేను" గోపాలం విసుక్కున్నాడు.

కాళ్లు కడుక్కోడానికి స్నానాలగదికిపోతూ తువ్వాలుకోసం బట్టల బీరువా తెరిచేసరికి, టక్కున కింద పడింది మిలమిల లాడుతూ థర్మామీటరు గొట్టాం. ఆ పాళంగా వొంగితీసి, మూత తెరిచి చూసేడు. మొన విరిగిఉంది. అర నిముషం పాటు ఆ పనికిరాని గాజుముక్క అతని చేతిలో ఉందో లేదో, ముఖం వెలవెలబారింది; ఏవో విషాదచ్ఛాయలు గోచరించేయి, తనలో తనకే జాలివేసి, ఆ దీనత్వంలోనే మందహాసం స్ఫురించింది!

ఆ మూలంలేని మొండెం చేత్తోపట్టుకు చూస్తూనే అప్రయత్నంగా యీజీ ఛెయిరులో కూలబడ్డాడు గోపాలం. ఆనాడు విరిగిపోలేదది. ఏనాడో యిరవైయేళ్ల క్రితం పాడయి పోయింది. కాని దాన్ని చూచేసరికి అప్పుడు జరుగుతున్నట్టు నాటి పరిస్థితులన్నీ ఒక్కటొక్కటే కళ్లకి కట్టేయి.

## ౨

తన పదోయేట. పుట్టిన దినం యింకా పది రోజులు ఉందనగా కొత్తబట్టలు కుట్టించింది తల్లి. కాని తను ఆబట్టలు తొడుక్కుని ఆమెకి నమస్కరించలేకపోయాడు; సరిగదా, చక్కగా తలంటి పోసుకుని ముచ్చటగా ఉడుపులు ధరించవలసిన ఆ పుట్టిన రోజునే, ఏటిలో స్నానంచేసి, తడిగా వంచాతో పరలోకమార్గాన పోతూన్న తల్లికి ప్రణమిల్లవలసి వచ్చింది. ఆ తరవాత పరామర్శలకి వచ్చిన పెద్దవాళ్లు అనుకుంటూన్న మాటలు, దిగాలు పడి ఓమూలకూచున్న తన చెవినీ పడ్డాయి. ఆ పల్లెటూరిలో సమర్థతగల డాక్టరు లేడు. పొరుగునున్న పట్నానికి తీసుకువెళ్లి వైద్యంచేయిద్దాం అంటే తండ్రి దగ్గిర డబ్బులేకపోయింది. అప్పూ సప్పూచేసి సరంజాం అయ్యేవేళకి తల్లికి నూరేళ్లూ నిండిపోయేయి. సరి అయిన మందూ దక్కతాలేక తల్లితనని విడిచి పోయింది.

తరవాత కొద్దికాలానికే పట్నం చేరుకున్నాడు తను, పల్లెటూరి వీధిబడి వొదిలి, కలిగినవాళ్లు ఎవరో, పాపం, కనికరించి వీధికొళ్లో ఉండమన్నారు. ధర్మదాత హెడ్మాస్టరు సత్రంలో పద్దు వేయించేడు, స్కూలు జీతం తాను భరించి. ఈ యేర్పాట్లు నాలుగూ చూసుకుని మర్నాడు ఉదయాన్నే తండ్రి బస్సులో ప్రయాణం అయేడు; యింక బస్సుకదులు తుందనగా, "ఒరేయ్, బాబూ," అంటూ పిలిచి బొడ్డు కొంగునుంచి తీసి ఒక్కరూపాయి చేతులో పెట్టేడు తండ్రి. "ఇది పెట్టి—" వాక్యం ముగియకుండానే బస్సు సాగిపోయింది తండ్రి కళ్లల్లో నీళ్లు గిరుక్కుమని సుళ్లుతిరిగేయి. అరచేతిలో రూపాయి తళతళ లాడింది. అనుకోకుండా తన కంటినుంచీ రెండు నీటిబొట్లు చెక్కులమీదకి జారేయి. మరిరెండు రోజులు పోయేసరికి, బెంగెపెట్టుకున్నాడో, ఏంవో? కొంచెం రవ్వతగిలింది. ఇంటివాళ్ల అబ్బాయి మ్యూనిసిపల్ ఆసుపత్రికి తీసుకు వెళ్లేడు. గోపాలానికి గుండెకొట్టుకుంది. డాక్టరు ఏమంటాడో? ఏంవి యిమ్మంటాడో?

ఒస్సి! యేంవిజనం!! డాక్టరుగారికి గాలి అయిన తగలకుండా ఉన్నారు. ఒకాయన పిల్లవాణ్ణి ఎత్తుకుని ఆయన దగ్గిరకి వెళ్లేడు. వాడి కాలికట్టు యింక విప్పేలేదు, గోలపెట్టి ఏడిచేడు. మరికొంత మంది తలకి గుడ్డచుట్టుకున్నవాళ్లూ, కళ్ల కలకలవాళ్లూ చెవిపోట్లవాళ్లూ, రకరకాల జబ్బులతో వరండాలో బెంచీలమీద కూచున్నారు. ఒహడు తల రెండుచేతులోనూ పట్టుకుని "అమ్మయ్యమ్మయ్యా" అంటున్నాడు బాధ భరించలేక మరొకడు పొట్ట చేత్తో పట్టుకుని, బుర్ర కడుపులోకి జొచ్చుకుపోయేలాగ చుట్టుకుపోతూ, "ఏం దారి నాయనా" అని ఏడుస్తున్నాడు. ఓ యిల్లాలు గోరుచుట్టు చెయ్యి ఎత్తుగా యెత్తి రెండో చేత్తో నొక్కిపట్టుకుని, పెదిమలు కరుచుకుంటూనే బాధ అపనయించుకుంటోంది. ఇంకో ఆమె చలిగాలికి వొణికిపోయినట్టు దవడలు గజగజ లాడిస్తూ, రగ్గు వొంటినిండా కప్పుకుని మూలుగుతోంది, మలేరియాతో. ఇంకొంతమంది జట్కాలు కూడా తీసుకువచ్చి సిద్ధంఅయేరు, డాక్టరు గారిని యిళ్లకి తీసుకువెళ్లడానికి. ఆయన దర్శనం కోసం పడిగాపులుపడి కూచున్నారు, మరో కొంత మంది, మందుసీసాలు పట్టుకుని. పాపం, తల్లిజబ్బులో తన తండ్రి కూడా యిలాగే పడిగాపులుపడేవాడు కాబోలు! కాకపోయినా బుద్ధిలేని భగవంతుడు, తనని అంత చిన్నవాడుగా ఎందుకుచేసేడు? కాస్త పెద్దవాడుగా యిదయితే తండ్రికి చేదోడుగా ఉండునా? అసలీ వొచ్చినవాళ్లలో ఎంతమంది పేదవాళ్లో తనలాగ? మందులకోసం యెంతమంది డబ్బు అప్పు తెచ్చుకున్నారో! తన తల్లిలాగే వీళ్లూ చచ్చిపోతారా యేంవిటి చెప్మా, మందులు కొనుక్కోడానికి డబ్బులేగా? డబ్బు! డబ్బు!! అవునుడబ్బు! తన జ్వరం నిమ్మళించడానికి మందు కావాలంటే కొనుక్కోడానికి డబ్బుకావాలికదూ మరీ? అసలు డాక్టరికి చూపించేసరికే యేంవంటాడో? యేంవిమ్మంటాడో?

కాని డాక్టరు ఏంవీ అన్లేదు; యేమీ యిమ్మనాలేదు. నాలికచూసేడు; నాడి పరీక్షించేడు. జ్వరం కొలిచేడు. మూడురోజులకి మందిచ్చి, నాలుగో నాడు మళ్లీ రమ్మనాడు. అంతే. ఆ రమ్మనమున్న నాటికి జ్వరం పోనేపోయింది. అయినా వెళ్ళకపోతే డాక్టరు ఏం కోంపడతాడో అనే వెళ్లేడు. తన భయాలన్నీ వొట్టివే. ఆయన నవ్వుతూ పలకరించేడు.

ఇంక వొంట్లో జబ్బుఏమీ లేదని, అన్నంతిని హాయిగా వుండమన్నాడు.

ఫలానా యింత సొమ్ము యివ్వాలి అని డాక్టరు అడగలేదు; ఎంత యివ్వాలో తనకి తెలియదు. అసలు తనదగ్గిర ఏమీ లేనూలేదు. ఆమాత్రం అస్కారమే ఉంటే తల్లే బ్రతికిఉండేదిగా. అదుగో ఆ తల్లి మాటా, తను కటికదరిద్రుడన్న సంగతీ తట్టేసరికి కళ్లు నీళ్లతో నిండిపోయేయి గోపాలానికి. అప్రయత్నంగా చెయ్యిజేబులోకిపోయింది. అనుకోకుండా అనేసేడు: "డబ్బులేక మా అమ్మ జబ్బుతో చచ్చిపోయింది. పేదవాణ్ణి. నన్ను యిక్కడ దిగబెట్టి వెళిపోతూ మానాన్న యిచ్చిన ఈ ఒక్కరూపాయీ ఉంది. తీసుకోండి" అంటూ, అప్పట్లో తనదీ అనుకున్న ఆస్తి ఆ ఒక్క రూపాయీవొణుకుతూన్న చేతులలో బల్లమీద ఉంచేడు అతను. డాక్టరుకి గుండె నీరయిపోయింది. కన్న కొడుకులాగ పొదివిపట్టుకుని అన్నాడు: "మీనాన్న యిచ్చిన రూపాయి నీదగ్గిరే ఉంచుకో. మరో రెండు నేను యిస్తున్నాను. యిందు. నీకే యిబ్బంది వచ్చినా నాతో చెప్పు;" అంటూ బుజ్జగించి పంపేడు.

తన చెవులు తనే నమ్మలేక పోయేడుగోపాలం. డాక్టరంటే దేముడా? అవును. భగవంతుడే ఆ వేషంతో వచ్చిఉండాలి. లేకపోతే యెవ్వరని యేగానీ అయినా పుచ్చుకోకుండా వైద్యంచేస్తాడా? పైగా, డబ్బుకూడా యిచ్చేడు. ఎంత మంచి మందూ? టక్కున రెండురోజుల్లో నిమ్మళించింది! అసలు అతనిగది నిండా మందులే. ఎన్ని రకాలమందులూ! ఎన్ని రంగులూ!! కొన్ని సీసాల్లో ఏవో గుండలు కూడా వున్నాయి. అసలు డాక్టరు అవడానికి ఎంత అదృష్టం ఉండాలో!

అంతవరకూ సాయంత్రం ఏమీ తోసుపోక, చీకటి పడి సత్రవువేళ అయేదాకా దిగాలుపడి, బిక్కమొగం వేసుకుని, తన కొట్టు కిటికీలోనుంచి తదేక ధ్యానంతో పరధ్యానంగా శూన్యంలోకి చూస్తూ కూచునే గోపాలానికి, నాటినుంచీ ఒక వ్యావృత్తి యేర్పడింది. తనంత తనే ఒక కొత్త ఆట కనిపెట్టేడు. నాలుగు రంగుల పిండిరాళ్లు రోడ్డుమీదవి యేరి తెచ్చుకున్నాడు. ఒకదానిమీద ఒకటి పెట్టి అరగదీసి, ఆ వచ్చిన రంగు రంగుల గుండలు ఒక్కొక్క సీసాలోనూ పోసేవాడు. వాటికిచిన్న చిన్న చీటీలు అంటించి పేర్లు రాసేవాడు: "తలనొప్పికి మందు; కడుపునొప్పికి మందు; దెబ్బతగిల్తే మందు; తేలుకాటుకిమందు; వికారానికి మందు"! ఈ మందులు చూసుకుని తను డాక్టరు అయిపోయినట్టూ, రోగాలు కుదిర్చేస్తున్నట్టూ పట్టపగలే కలలు కనేవాడు. ఆ మందులు చేసుకున్న తొలినాడు రాత్రి నిజంగా తనతల్లే కలలో కనిపించి బాధ పడుతూఉండేవరికి, "ఇదుగో ఈ యెర్రమందు వేసుకో, అమ్మా, పోతుందీ...ఒక్క గుక్కెడు తాగుదూ...ఆఁ అను...ఆః....ఇంక పోతుందిలే ఒక్క దెబ్బదిని...మా డాక్టరుగారు నాకు యీ మందే యిచ్చేరు." అని ఊపలవరించేడు కూడాను!

రోజూ సాయంకాలం దేవుడి గుడికి వెళ్లినట్టుగా అతి శ్రద్ధతో ఏదో చెప్పలేనిఉత్సాహంతో ఆస్పత్రికి వెళ్లి, తలుపులు వేసేసి ఉన్నా, డాక్టరుగారి గదిచుట్టూ ఓసారి తిరిగేవాడు; కంపౌండింగురూము వెనకాల కాస్సేపు తార్లాడేవాడు. అందమ్మట అలా తిరుగుతూన్నప్పుడు ఒక్కొక్కసారి రోగులకి నాడి పరీక్ష చేస్తూన్నట్టూ, వాళ్లని ఏవో ప్రశ్నలు అడుగుతూన్నట్టు, వాళ్లూ యెంతోదీనంగా యేదో తనతో మొర్ర పెట్టుకుంటూన్నట్టూ అనిపించేది. అసలు డాక్టరు అనే వాడు ఒకడు ఉండబట్టిగాని, లేకపోతే ప్రపంచంలో ఎంత బాధ ప్రబలిపోయేదో? తనే డాక్టరయితేనా? అడగని వాడిదే పాపం అన్నట్టు యిట్టే చేత్తో తీసి పారెయ్యడూ యెంతలేసి జబ్బులయినానూ!

తలుపులు తాళాలు వేసేసుకుని ఆసుపత్రివాళ్లు యిళ్ళకిపోయినా, ఆ డాక్టరుగారి గది ముందు తను అలానిలుచుండి పోయేవాడు. గంటలకొద్దీని. అంతలో ఏదో పని ఉండి ఓనాడు కంపౌండరు రానట్టూ, యిహమందులుకూడా తనే కలుపుకోవలసినట్టూ అనిపించి, ద్విగుణీకృత ఉత్సాహంతో చరచరా డాక్టరు గది దగ్గర్నుంచి కంపౌడింగు గది వద్దకి పోయేవాడు. వెళ్ళిచేసిన పనల్లా, మూసేసివున్న అద్దాలతలుపులమీద తలపెట్టి, కిటికీ ఊచల మధ్యగా ఆ మందులసీసాలు ఉన్న టేబిలు చూడ్డంవే; అలా చూస్తూ వొళ్లు మరిచి పోయేవాడు గోపాలం.

చూస్తూ ఉండగానే స్కూల్లో మరి రెండేళ్లు గడిచేయి. పెద్దక్లాసుల్లోకి వెళ్లేడు. అమాయకపు

గోపాలానికి శాస్త్రజ్ఞానం కూడా అబ్బుతోంది. స్కూల్లో యెన్నో విషయాలు చెబుతున్నారు—భౌతికశాస్త్రం అనీ, రసాయనశాస్త్రం అనీ, దేహశాస్త్రం అనీ అదనీ యిదనీని. లేబరేటరీలో ప్రయోగాలు అతణ్ణి ఎంతో ప్రోత్సాహపరుస్తూ ఉండేవి. వారానికి ఒక్కటే క్లాసయినా, ఆ ప్రాక్టికలు క్లాసు కోసం తపస్సు చేసేవాడు గోపాలం. లేబరేటరీ ఎంత ముచ్చటగా ఉంటుందీ? బున్సను బర్నర్లు, సున్నితమైన త్రాసులూ, జార్సూ, బీకర్సూ, రిటార్టులూ, కిప్పు ఏపరేటస్!—ఓఓః. అది సామాను గాదు! డాక్టర్లు బహుశా యీ లేబరేటరీలు చూసే కాబోలు, ఆ కంపౌండింగు రూములు కూడా అలా అమర్చుకుంటారు ముచ్చటగాను!!

ఏ ఆస్కారం లేకుండా ఊహాసౌధాలు కట్టుకుని విహరించే గోపాలానికి, తనకి యిల్లు యిచ్చిన వాళ్ల అబ్బాయికి ఓసారి సుస్తీచెయ్యడంతోనే మరీ దోహదం అబ్బింది. ఆ మూడువారాల్లోనూ వార్డుబోయి, నర్సూ, కంపౌండరూ, డాక్టరూ అనుకునే నాలుగుమెట్లూ దాటేసేడు అంటే నమ్మండి! ప్రతీ నాలుగుగంటలకీ మందుయివ్వడంలో నయితేనేం, టైముప్రకారం "డయటు" యివ్వడంలో నయితేనేం నిమిషం అటూయిటూ అయేదికాదు. రెండుపూటలా జ్వరంపోయింట్లతోసహా గ్రాఫుగీసి పెట్టేవాడు. ఉడుకులాం గుడ్డలు మార్చడానికీ, ఆడిన చెయ్యి ఆగకుండా విసురుతూ కూచోడానికీ తదితర ఉపచారాలకీ తల్లిదండ్రులని మించి చరించేడు. ఇతని ఆసక్తీ ఉత్సాహం చూసి డాక్టరే ముక్కున వేలేసుకుంటే! అతనికి అవ్యాజానురాగం జనించింది. ఉదయసాయాహ్నాలు పేషెంటుని చూడ్డానికి వచ్చినప్పుడు అర్జంటు బేగ్ పుచ్చుకుని కారుదాకా వచ్చిన గోపాలంతో యెన్నోవివరాలు చెప్పేవాడు—జ్వరం ఎందుకు వొచ్చిందో, నిద్దరపట్టకపోవడానికి కారణం యేమిటో, లివరు కండిషను యెలాగ ఉందో, యింకేదో, మరేదోను! పేషెంటుకి గ్లూకోజునీళ్లూ, పళ్లరసమూ అదీ పట్టేటప్పుడు గోపాలం హృదయకుహరంలోంచి పెల్లుబ్బి వచ్చేది ప్రేమవాహిని. అదృష్టహీనుడు కాకపోతే అందులో ఆవగింజంత చాకిరీచేసుకుని వుండకూడదూ కన్నతల్లికీ?

## 3

ఆరిపోయే ముందు దీపం మరీయిదిగా మండుతుందిట ఒక్కమాటు! గోపాలం స్కూలుకు ఫస్టుగా పాస్యయ్యేడు స్కూలుఫైనలు. తండ్రివద్ద పల్లెటూరిలో ఉండగా వచ్చింది శుభవార్త. ఆ కబురు విన్ననాడు తండ్రి పరమానందభరితుడైపోయాడు; గోపాలం అయితే వొళ్లే మరిచిపోయేడు. ఇహనేవుందీ? నెమ్మదిగా ప్రిన్సిపాలు కాళ్లూ కడుపులూ పట్టుకుని, తన మార్కులు చూపించి ప్రాధేయపడితే ఇంటరుమీడియేటులో స్కాలరుషిప్పు రాకపోదు. సత్రవు భోజనం,—వాళ్లయింట బస, యెలాగా వున్నవే కదా. రెండేళ్లపాటు కష్టపడి చదివితే తరవాత తనూ డాక్టరీకి పోవచ్చు. అంత వరకూ అండగా నిలిచిన భగవంతుడు అప్పుడు మాత్రం తోడుపడడూ? తను చదువుకుంటానంటే తండ్రిమాత్రం వద్దంటాడా? ఎందుకంటాడూ, తను ఎక్కడయినా తప్పిపోయేడు గనకనా? కాగా, స్కూలుకి ఫస్టుగా వచ్చేడాయిరి! ఆనాడంత హాయిగా, సుఖంగా అతను యింకెన్నడూ నిద్రపోలేదు! మరో నెల్లాళ్లదాకా చదువు ప్రసక్తే రాకపోవడం వల్ల తను అనుకున్నట్టే తండ్రీ అభిప్రాయపడ్డాడని అనుకున్నాడు, గోపాలం.

కాని తండ్రి మనఃస్థితి వేరయింది. కొడుకు పరీక్ష పేసయేడని ఆ ఉత్కటానందం సంబాళించుకోడానికే కొన్నాళ్లు తీసుకుంది ఆ వృద్ధ హృదయం. అంతలో మళ్లీ బడితెరిచే రోజులు దగ్గిరకిరాగా, అతని గుండెల్లో రాయిపడింది. మళ్లీ యెప్పటి ఆశే. ఎక్కే గుమ్మమూ దిగే గుమ్మమూను! కాగాపోగా, యెన్ని అగచాట్లు పడాలో! ఆరేళ్లక్రితం తను పడ్డపాట్లు యింకా మరిచిపోలేదతను. ఇంకా గుమ్మం యెక్కకుండానే—మోకాలు దిగని తన పంచా, రెండు మాసికలు వేసినా యింకా చిరుగు మిగిలిపోయిన లాల్చీ కంటపడేసరికి—"ఊఁ. వెళ్లండయ్యా... ఇక్కడేఁవీ సదుపాయం జరగదు... మరీ దాచబెట్టినట్టు వస్తారు" అని విసుక్కున్నాడు ఓ పంతులుగారు. "బొత్తిగా ముక్కూ మొహం యెరగని మనిషిని యింట్లో యేమని పెట్టుకోమన్నారు, బాబూ. ఇలాగే ఎవరికో కాస్తచోటు యిచ్చేసరికి మావాళ్లయింట్లో రాత్రికి రాత్రీ రెండువెండికంచాలు

మాయం అయిపోయేయి" అన్నారు యింకో భవంతిలో పెద్దమనుషులు.

"నిజఁవే. మీ స్థితి తలుచుకుంటే జాలేస్తోంది. కాని ఏం చెయ్యమూ? ఈ కరువురోజుల్లో మాదినూకే చాలకుండా వుంది...ఎంత చెట్టుకి అంత గాలీ" అంటూ లోని బండారం బయటపెట్టేడు ఓ జరీధోవతి ఘరానా ఆసామీ.

"సరే. పిల్లవాడిని వెంటబెట్టుకువస్తే, ఏదో ప్రయివేటు ట్యూషను కాబోలు ననుకున్నాను. ఆనాలుగు రాళ్లూ లేక పోవడం సరేకదా, పైపెచ్చు అద్దెకూడా పోగొట్టుకుని యిల్లు ఉచితంగాయివ్వనా? కుదరదు బాబూ,...యింకెక్కడయినా వ్యాపగించండి" అని సలహా యిచ్చేడు యింకో లక్ష్మీ ఉపాసకుడు, స్కూలు మేష్టరు.

చివరకి వాళ్లు ఆ వీధిగది యిచ్చేరనుకోండి. కాని మూడురోజులు సూటీపోటి మాటలతో ఒళ్లు చితికిపోయి, తిరగలేక కాళ్లు అరిగి పోయేయికావూ? అవన్నీ అతడు మరిచిపోలేదు. ఎలా మరిచి పోతాడు? పేదవాళ్ళకి యీ ప్రంచంలో చోటు అంటూవుంటే గదూ?

అలాగని తారాజువ్వలాగ ముందుకి నెట్టుకు వెళ్లేకుర్రవాడి భావిని అరికట్టడమూ తనకి సాధ్యం కాలేదు. వాడి చదువు అంతటితో మానిపించి ఏమిటి చెయ్యడం? తనలాగే బోర్డు స్కూలు మేష్టరీ అంటే, రోజులు మారిపోయేయి; ఆ ఉద్యోగానికి యిప్పుడు బి. ఇ. డీలు వస్తున్నారు. ఇంక గుమాస్తాగిరీకా? దానికీ బి. ఏ లేపోటే. పోనీ, వ్యవసాయం చేసుకుంటాడంటే, ఉన్న గోష్పాదమంత భూమీ పెళ్లాం జబ్బులో కరారాఁవుడి చుట్టుకు పోయింది! ఇంక ఏ ఆలోచన పాలుపోక ఓనాడు ఉదయాన్నే బయలుదేరి, ఆ వీధికొట్టు యిచ్చినవాళ్ల దగ్గిరకే వెళ్లేడు, కుర్రవాణ్ణి వెంటబెట్టుకుని.

గోపాలం గుమ్మంలో అడుగుపెట్టేసరికి, ఎవరో దగ్గిర చుట్టాలు వచ్చినట్టు కళకళ లాడింది ఆ యిల్లు. ఇంటివాళ్ల కుర్రాడు, చాలా కాలానికి పొన్నూరినుంచి వచ్చిన తమ్ముడికి మల్లే కౌగలించుకున్నాడు గోపాలాన్ని. వంటింట్లో చెయ్యి తీరిక లేకుండ ఉన్నవాళ్ల అమ్మ, ఇతను వచ్చిన సందడి విని, అపాళంగా యెక్కడపని అక్కడ వదిలేసి, నవ్వుతూవొచ్చి నోటినిండా పలకరించింది "ఇదుగో గోపాలం వచ్చేడా యేఁవిటి? రెండు నెలలనుంచీ నువ్వు లేకపోవడం, యిల్లు యెంత చిన్నబోయిందనుకున్నావ్" అంటూను. ఇంటాయన కూడా హృదయపూర్వకంగా స్వాగతం యిచ్చేడు. ఆ ఆదరాభిమానాలతో గోపాలం తండ్రికి కడుపునిండిపోయింది. భోజనాలయి కాస్సేపు విశ్రమించేక, ముసలివాళ్లిద్దరూ కుర్రవాడి ముందుగతి ఆలోచించడం మొదలెట్టారు.

"అసలు గోపాలం ఉద్దేశం ఏమిటో?" అంటూ గణపతిస్తవం చేసేడు యింటాయన. అంతకన్నా అదను దొరకదు అనుకున్నాడు గోపాలం. రెండు నిముషాల్లో టక్కున తన ప్లాను చెప్పేడు. అది వినేసరికి యింటాయనకి జాలి వేసింది; గోపాలం తండ్రికి మతి పోయింది. ఏఁవి అనడానికి తోచక దిగాలుపడి వుండి పోయేడు ఓ రెండునిముషాలు.

"అవునోయ్, నువ్వు అన్నమాట బాగానే వుందనుకో," ఇంటాయనే ప్రారంభించేడు, "మా కొట్లో నువ్వు ఉండడానికి యెంతమాత్రం అభ్యంతరం లేదు; యెవరినో దేవుళ్లాడి సత్రవులో పద్దూ వేయించుకోవచ్చుననుకో."

"ఇంక పుస్తకాల మాటేనా మీరంట?" గోపాలం పట్టలేని వుత్సాహంతో అందుకున్నాడు, "లైబ్రరీలో తెచ్చి చదువుకుంటానండీ."

"అబ్బా. అవన్నీ బాగానే వున్నాయోయ్," యింటాయన ప్రస్తావన సాగిస్తూనే ఉన్నాడు, "ఇంటరు నిరభ్యంతరంగా చదువుకోవచ్చును; నిశ్చయంగా ప్యాసూ అవుతావు. కాని...నువ్వు అన్న మెడికలు చదవాలంటే విశాఖపట్నం వెళ్లాలా? అద్దు లేకుండా అయిదేళ్లు పొరుగూరిలో ఉచితంగా భోజనం అదీ అంటే—! పోనీ చదువుతావే అనుకో యెలాగో ఒకలాగ. వెంటనే గవర్నమెంటులో ఉద్యోగం వస్తుందన్న గ్యారంటీ ఏఁవిటి? ఇంక, ప్రయివేటుగా దుకాణం పెట్టాలంటే నాలుగైదు సంచులయినా మదుపుఉండాలా? ఈ గడ్డురోజుల్లో అంత సొమ్ము—" మాట సగంలో నీళ్లు జంతికల్లాగ నమిలేశాడు యింటాయన. రెండేళ్ల తరవాత జరగ

బోయే పరిస్థితుల్లో ఏ ఉపాయంచేత ఒడ్డున పడ గలడో ఊహించలేక ఊరుకున్నాడు గోపాలం.

"ఇంకేదయినా సబ్జక్టు తీసుకుని చదువుతానను. ఏ ఆటంకం లేకుండా బి. ఏ. వరకూ నీ చదువు కొనసాగేటట్టు చూసే పూచీనాది." పాపం, యింటాయనే భరవసా యిచ్చేడు. "ఆ తరవాత అయినా ఉపాధిసమస్య ఉండనే ఉంది కదండీ?" అన్నాడు అంతవరకూ ఏం మాటాడలేకుండా కూచున్న గోపాలం తండ్రి.

"లేకపోతే ఇంటరుతో మానేస్తావా?" యింటాయన మళ్లీ ముదలకించేడు గోపాలాన్ని.

"భస్. అది బొత్తిగా త్రిశంకు స్వర్గం" నిముషంలో తెమిల్చేసేడు గోపాలం. ఎంతసేపు తర్జన భర్జన చేసినా వ్యవహారం తెమల్లేదు. భోజనాలదగ్గిర కూడా యివేమాటలు.

"ఆడదాన్ని అని నామాట కొట్టి పారెయ్యకండి గానీ, మనగోపాలాన్ని మాతమ్ముడి దగ్గిరకి పంపిస్తేనో" అంది ఆ యిల్లాలు పులుసులో ముక్కలు వొడ్డిస్తూ. ఈ మాట చెవినిపడేసరికి, నములుతూన్న ముద్దం చేత్తో పుచ్చుకుని చెవులు రిక్కించి మరీ వింటున్నాడు గోపాలంతండ్రి; గోపాలం రెండు కళ్లూ ఆమెకే వప్పచెప్పేడు.

ఏంవిటో అది? అన్నట్టుగా తలయెత్తిచూసేడు యింటాయన.

"ఏవీ లేదు...మాతమ్ముడి షాపులో—

అంతే అరుణకిరణాలకి మంచు తెరులు విడిపోయినట్టు చిక్కువిడిపోయి సమస్య పరిష్కారం అయిపోయింది. గోపాలం, వాళ్లతండ్రీ బలవంతాన నాలుగు రోజులు ఉండిపోయారు ఆ వూళ్ళోను - ఆలోగా గోపాలానికి షాపులో ఉద్యోగం ఖాయ పడిపోయింది. ఇంటాయన తండ్రీకొడుకులకి విందు చేసేడు, సాయంత్రం ప్రయాణం. ఇంక సుమ్మం దిగుతాడనగా, యింటి వాళ్ల అబ్బాయి గోపాలాన్ని అవతలకి పిలిచి, మిలమిల్లాడుతూన్న థర్మామీటరు గొట్టాం చేతిలో పెట్టేడు, "ఇదుగో, గోపాలం, ఆ వేళ నాజబ్బులో థర్మామీటరు కొరికేసేను జ్ఞాపకం ఉందీ! ఇన్నాళ్లూ యిద్దరం దీన్ని చూసి నవ్వుకునే వాళ్లం. ఇది నీ బట్టల మడతల్లో వుంచుకో. ఏ లాల్చీవో తీసుకున్నప్పుడు టక్కున కిందపడేసరికి నేను జ్ఞాపకం వస్తూఉంటాను" అన్నాడు నవ్వుతూను.

౪

ఆనాడు గుమాస్తాగా ప్రవేశించిన గోపాలం, అక్కౌంటెంటయి, అసిస్టెంటు మేనేజరయి, క్రమేణా ఆ షాపులో వాటాదారు అయేడు. పెళ్లి చేసుకున్నాడు. ఆర్జనకేంవీలోటులేదు. చిన్నకారూ చక్కటి బంగళా, కొండంత పలుకుబడీని.

నిజమే. డాక్టరు చదివితే మాత్రం ఆర్జన అంత కన్నా బాగుండేదా?

అసలు ఆమాత్రం అయినా ఉండేనా?

అదుగో, అక్కడే తన నిత్యవృత్తికీ, మనోరథానికీ రాజీ కుదరలేదు. "డబ్బులేక పోబట్టేగదా మనసుకి నచ్చిన చదువు చదువుకోలేక పోయేవూ? డబ్బు ప్రధానం" అంది వృత్తి చైతన్యం.

"ఏమిటో. డబ్బుడబ్బని యేడుస్తావు. వెధవ డబ్బు. ముష్టిముండా ఆర్జనా నువ్వూనూ! భోగంది గడించడం లేమూ?" అంది భంగపడిన మనోరథం, ఏ మూలనుంచో.

"అదేంవన్న మాటలే. భోగందానికీ నీకూ వ్యత్యాసం లేదూ?, నీ వృత్తిలో ఎంత స్వతంత్రం, ఎంత దర్జా!!" వృత్తి చైతన్యం ఆర్భాటించింది.

"చాలూరుకో. నీ దర్జానువ్వూను. ఎవరయినా వింటే నవ్విపోగల్రు! పెర్మిట్లకోసం ఉద్యోగస్థులని ఆశ్రయించేటప్పుడు యీ దర్జా యేమయిపోతుందో?" దెబ్బతిన్న పాతకోరిక మూలనుంచే యెత్తి పొడిచింది.

"ఎందుకొచ్చిన మిడిసిపాటులే. వైద్యుడయితే ఏం మహా ఊడపొడిచేసేడా? నీలాంటివాళ్లు యిచ్చే వార్షికాల వల్లనేగా, వాళ్లూ పెద్దవాళ్లు అవుతా?" వృత్తి చైతన్యం తన అహంకారాన్ని విడవలేదు.

"డాక్టరుకి యెంత పలుకుబడో తెలుసా?" యీడేరని మనోరథం యేడిపించుకు తింది.

"ఆ మాటకి వస్తే డబ్బున్నవాడికి ఉండే పలుకుబడి యెవ్వరికీ ఉండదు. డాక్టర్లు పలకడం యిచ్చే డబ్బునుబట్టే ఉంటుంది. కోరిన ఫీజు గుమ్మరిస్తే యే డాక్టరు రెక్కలు కట్టుకు వాలడూ? అలా యివ్వడానికి తగిన సమర్థత సంపాదించేవు. సంతోషపడు."

వృత్తిధర్మం, ఫైనాన్సు డిపార్టుమెంటులాగ, అధికారం చెలాయించబోయింది.

"ఓహోహో! ద్రాక్షపళ్లు పులుపు అందిట వెనకటికి ఓ నక్క! అడిగినంత డబ్బూ యిచ్చి ఆరుగురు వైద్యులనయినా మార్చేవు. నీ తండ్రికి నయం అయిందీ? వాళ్ల చేతిలో కీలుబొమ్మవయి ఏ ఆట ఆడిస్తే ఆ ఆట ఆడుతున్నావు—రసమో, కషాయమో, మంత్రమో, యింజక్షనో, ఆపరేషనో మరేదో—వాళ్లు నంది అంటే నందీ పంది అంటే పందీనీ," మనోరథం గుండెల్లో చెయ్యి పెట్టి కలికేసింది!

"ఇంక కట్టిపెట్టు ఆ ధోరణి. అందరికీ అన్ని విషయాల్లోనూ ప్రావీణ్యం ఉండదు. అలాగే అయే మాటుంటే యిన్ని వృత్తులంటూ యెందుకూ?" వృత్తి చైతన్యం హుంకరించింది.

అప్పటికే మనోరథం ఓడిపోయేనని ఒప్పుకోలేదు,

"నిజమే. అందరికీ అన్ని విద్యలూ పట్టుపడతాయని యెవ్వరూ అనరు. కాని ఒకానొక విషయంలో చక్కని ఉత్సాహం కలిగి, గట్టి నిష్ఠా యేర్పడుతున్నాది అనుకున్నప్పుడు, ఆ అవకాశం వదులుకోవలసివచ్చింది కదా అని మాత్రం విచారం! నువ్వు అనుకున్నట్టూ పథకం సాగివుంటే, తల్లి పోయినందుకు, నీ తండ్రికి యీ చివరి రోజుల్లో ఎంత శాంతీ సంతృప్తీ ఉండేవో కదా అనిపిస్తుంది. తెలుగు వైద్యులు, యింగ్లీషు డాక్టర్లూ, హోమోపతీవాళ్లూ-ఛీర! ఎంతమందిని మార్చేవూ! నీ చేతిలోనే ఆ విద్య ఉంటే, తండ్రి గుండెల్లో ఆవేదన యేదో సూటిగా తెలుసుకుని చికిత్స చేసేవాడివి కదూ?" "జ్వోనల్ టి. బీ." అని తెలుసుకోడానికి మూడు నెలలు పట్టిందా? ఈ లెఖ్ఖని మూడేళ్లయినా పడుతుందా కుదరడానికి? ఈలోగా—డబ్బు కేం—అడ్డమయిన సలహాలతోనూ ఆయనకి ఎంత యిబ్బందీ?

"నువ్వు ఆర్జనపరుడవయ్యావు, నిజమే. రెండు చేతులతోనూ గడిస్తున్నావు, ఒప్పుకున్నాం. కావాలంటే కొండమీది కోతినయినా కొనితేగలవు, సందేహం లేదు. కాని, ఏమయినట్టూ? ఆయన అశాంతి ఏమయినా తగ్గిందా? సౌఖ్యం చేకూరిందా? పోనీ, నీమట్టుకు నీకు తృప్తి అనిపిస్తోందీ?

"ఉదయం గుమ్మం దిగింది మొదలు తిరిగీ గూటికి చేరుకునే వరకూ, తండ్రి యెలాగ వున్నాడో అని గుప్పెట్లో నేగా ప్రాణాలూ! నీ అంతటి నువ్వే నాన్నగారిని పరీక్షచేసి, స్వయంగా మందిచ్చేవనుకో. యోగం తప్పించలేమని తెలిసినా, చెయ్యవలసిన పని చేసేం అని నీ గుండెకి ఎంత నిబ్బరం? ఏం, మాట్లాడవేం?" గోపాలం గుండెల్లో ఒకటే గగ్గోలు!

అంతలో కిందినుంచి పిలుపు: "రెండో షెల్ఫులో ఉందండీ, ధర్మామీటరూ. దీని మొహం యీడ్వా, యింతసేపూ బుర్ర చించుకున్నా జ్ఞాపకం వొచ్చింది కాదు"

"వచ్చే. వచ్చే" అంటూ ఉన్నవాడు ఉన్నపాళంగా క్రిందికి వెళ్ళేడు గోపాలం, గభుక్కున కలలోంచి మెలకువ వచ్చినట్టు.

"అదేఁవిటి? విరిగిపోయిందా ధర్మామీటరు?" గృహిణి ఆత్రుతగా అడిగేదాకా, గోపాలానికి ఆ మొనలేని ముక్క చేతులో పట్టుకున్నా నన్న స్పృహే లేదు.

"అచ్చే. యిది కాదు. పట్టుకు వస్తా. ఎక్కడుందన్నావ్?" అంటూ గిరుక్కున తిరిగి, కంగారు కప్పిపుచ్చుకుంటూ మెట్లమీద అదృశ్యం అయిపోయేడతను, చెట్టుమీద తొండలాగ.

ఇందిర తెల్లబోయి చూస్తూ కొయ్యలాగ నుంచుండిపోయింది!